నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

మంగళవారం | మార్చి 12, 2024 | www.navatelangana.com

ప్రతిభావంతులకు పురస్కారం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

2022-23లో పదవ తరగతిలో ప్రతిభ కనబర్చిన వడ్యాల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులకు సోమవారం ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ప్రథమ బహుమతి పిప్పెర లిఖితకు రూ.10వేలు, జెడ్డి మనిదీప్‌కు ద్వితీయ బహుమతి రూ.5వేలు నల్ల భీమ్‌రెడ్డి జ్ఞాపకార్థం నల్ల కల్పనా రామిరెడ్డి కుమారుడు-కోడలు నల్ల విలాస్‌రెడ్డి-లిఖితరెడ్డి అందజేశారు. ఇలా ప్రతి సంవత్సరం ఫలితాలలో ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్నట్లు దాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ చైర్మన్ నల్ల కల్పనా రామిరెడ్డి, ఇన్‌చార్జి పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూషణ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

నార్నూర్ : గాదిగూడ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ అన్నారు. సోమవారం గాదిగూడ మండలంలోని మేడిగూడ నుండి మారేగావ్ బిటి రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ రోడ్డు పనులకు రూ.8కోట్లు, పౌనుర్ నుండి లోద్దిగూడ బ్రిడ్జి, ఇతర నిర్మాణ పనులు రూ.6కోట్లతో చేపడుతున్నామన్నారు. రోడ్డు, బ్రిడ్జి ఇతర నిర్మాణ పనుల కోసం మొత్తం రూ.14 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. కాంట్రాక్టర్ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకుండా పనులు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి చంద్రకళ రాజేశ్వర్, వైస్ ఎంపిపి యోగేష్, మాజీ సర్పంచులు సంఘం మండల అధ్యక్షుడు రూపదేవ్, బిఆర్ఎస్ నాయకులు ఖాసిం, విద్యాధికారి ఆశన్న, కేజీబీవి ఎస్ఓ ప్రియాంక పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి హాస్టల్ వర్కర్ల సమ్మె

- డీటీడీఓ హామీతో తాత్కాలిక విరమణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ వర్కర్స్ పెండింగ్ వేతనాలకు బడ్జెట్ విడుదల చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో సోమవారం కలెక్టరేట్ ఎదుట సమ్మెకు దిగారు. డిటిడిఓ రమాదేవి హామీతో తాత్కాలికంగా విరమించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ రోజువారి వర్కర్ల వేతనాలకు బడ్జెట్ విడుదల కోసం సమ్మె నిర్వహించ తలపెట్టినట్లు వివరించారు. మొదటి రోజు డిటిడిఓ హామీతో విరమించినట్లు వివరించారు. ఈ రోజు నిర్వహించిన సమ్మె ఫలితంగా డైలీ వేజ్ వర్కర్ల వేతనాల బడ్జెట్ విడుదలైందని, తొమ్మిది మంది బాధిత కార్మికుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపడతామని జిల్లా అధికారి హామీ ఇచ్చారన్నారు. వర్కర్ల ఇతర సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్, జిల్లా అధ్యక్షులు అడ శ్యాంరావ్, జిల్లా గౌరవ అధ్యక్షులు వెలిశాల క్రిష్ణమాచారి, జిల్లా ఉపాధ్యక్షులు కనక రవి, శ్యామల, ప్రమీల, యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు పద్మ, మల్లికార్జున్, సంతోష్, హీరాబాయి, లతబాయి పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెరుగుదలకు చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-నిర్మల్

భూగర్భ జలాల పెరుగుదలకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో భూగర్భ జలాల పెరుగుదల, చేపట్టవలసిన అంశాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో భూగర్భ జలాల పెరుగుదలకు గుర్తించిన మండలాల్లో అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అధిక నీటి వినియోగం కలిగిన బైంసా, నిర్మల్ పట్టణం, గ్రామీణం, ముధోల్, కుంటాల, సోన్, దిలావర్‌పూర్, సారంగాపూర్, లోకేశ్వరం మండలాల్లో నీటి నిల్వలు పెంచేందుకు అమృత్ సరోవర్ కార్యక్రమం కింద చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి శాస్త్రీయ పద్ధతుల్లో స్థలాలను ఎంపిక చేయాలని ఆదేశించారు. కార్యక్రమం అమలుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. చెక్ డ్యామ్‌ల వద్ద వర్షపు నీటిని నిల్వ ఉంచేందుకు 'రీఛార్జి శాఫ్ట్' అనే నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని సూచించారు. చెక్ డ్యామ్‌ల ద్వారా వర్షపు నీటిని ఒడిసిపడితే భూగర్భ జలాలను రక్షించవచ్చని పేర్కొన్నారు. చెక్ డ్యామ్‌ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, భూగర్భ జల శాఖ డిడి పి.శ్రీనివాసబాబు, నీటిపారుదల శాఖ ఎస్ఈ సుశీలకుమార్, డీఆర్డీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

తమాషా చేస్తున్నావా? ప్రోటోకాల్ తెలియదా?

నవతెలంగాణ-తాంసి

ఏం తమాషా చేస్తున్నావా? ప్రోటోకాల్ తెలియదా? అని ఆర్అండ్‌బీ డిఈ సురేష్‌పై డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం భీంపూర్ మండలం ధనోర గ్రామంలో బీటి రోడ్డు నిర్మాణ పనులకు భూమి చేయడానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. డిసిసిబి చైర్మన్‌కు ఆర్అండ్‌బి అధికారులు సమాచారం ఇవ్వకపోవడంతో అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడానికి కృషి చేశానన్నారు. కష్టపడి తీసుకొచ్చిన నిధులకు ఎవరో భూమి పూజ చేసి పేరు తెచ్చుకోవడం ఏమిటని, కనీసం సమాచారం కూడా ఇవ్వరా? అని మండిపడ్డారు. ఇకముందు ఇలా జరిగితే పరిణామాలు వేరేగా ఉంటాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేతో పాటు మండల నాయకులు డిసిసిబి చైర్మన్‌ను సముదాయించి ఇకముందు ఇలా జరగకుండా చూస్తామని పేర్కొన్నారు.

క్షతగాత్రులకు సుగుణక్క పరామర్శ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

నాటక ప్రదర్శనకు శనివారం రాత్రి సిరికొండ మండలం సుంకిడికి వెళ్లి తిరిగొస్తూ ప్రమాదంలో గాయపడ్డ ఖండాల గ్రామానికి చెందిన ఆదివాసీలను ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆత్రం సుగుణక్క పరామర్శించారు. ట్రాక్టర్ బోల్తా పడిన ఘనలో 13 మంది గాయాలపాలయ్యారు. ఈ విషయం తెలుసుకున్న సుగుణక్క హుటాహుటిన రాత్రి 12గంటలకు రిమ్స్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.

పని స్థలాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఉపాధి పనులు జరిగే అన్ని గ్రామాలలో కూలీలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ అన్నారు. సోమవారం గన్‌పూర్ గ్రామపంచాయతీ శివారులో ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రతి పేదకు జాబ్‌కార్డు ఇచ్చి ఉపాధి కల్పించడమే తమ లక్ష్యమని ఎంపీపీ పేర్కొన్నారు. ఆయన వెంట ఈజీఎస్ సిబ్బంది, కూలీలు ఉన్నారు.

భూగర్భంలోకి జలం..!

- జిల్లాలో వేగంగా పడిపోతున్న నీటి మట్టం
- ప్రస్తుతం 7.40మీటర్ల లోతుకు పడిపోయిన వైనం
- మండుతున్న ఎండలు..38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- ఎండిపోయిన వాగులు..అడుగంటిన బావులు
- పనిచేయని చేతిపంపులు..తాగునీటికి మొదలైన కటకట
- సక్రమంగా సరఫరా కాని మిషన్ భగీరథ నీరు
- భవిష్యత్తులో మరింత ఆందోళనకరంగా పరిస్థితులు

ఆదిలాబాద్ జిల్లాలో భూగర్భజలాలు మరింత లోతుకు వెళ్తున్నాయి. వేసవితాపం అప్పుడే మొదలైంది. ఈ నెల మొదటి వారంలోనే ఎండలు మండిపోవడంతో భూగర్భ జలాల నీటిమట్టం మరింత దిగజారిపోతోంది. ఇప్పటికే నీటి వనరులైన వాగులు ఎండిపోవడం..బావులు అడుగంటిపోవడం..చేతిపంపులు పనిచేయకపోవడంతో తాగునీటి తాపం ప్రారంభమైంది. జిల్లాలో ఇప్పటికే భూగర్భజలాలు సగటున 7.40మీటర్ల లోతుకు పడిపోవడం ఆందోళనకరంగా మారింది. గత నెలలో 6.99మీటర్ల లోతులో నీరు ఉండగా కొద్ది రోజుల తేడాల్లోనే ఒక మీటరు లోతుకు పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. గతేడాది ఇదే సమయానికి 7.98మీటర్ల లోతుకు వెళ్లిపోగా.. ఈ ఏడాది సైతం అదే పరిస్థితి పునరావృతమవుతోంది. దీంతో ప్రతి ఏటా మాదిరిగానే ఈ యేడు సైతం తాగునీటి తాపం తప్పేలా కనిపించడం లేదు. వేసవి ప్రారంభంలోనే ఇలాంటి పరిస్థితి తలెత్తితే..రానున్న రోజుల్లో మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలో ఎండలు మండిపోవడంతో భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి. భానుడి ప్రతాపం పెరిగిన కొద్దీ నీరు మరింత లోతుకు వెళ్తున్నాయి. ఫలితంగా ఇప్పటికే అనేక గ్రామాల్లో తాగునీటి కటకట మొదలైంది. జిల్లాలో ప్రస్తుతం భూగర్భజలాలు 7.40మీటర్ల లోతుకు పడిపోగా.. జైనథ్ మండలం భోరజ్‌లో ఏకంగా 13.32 మీటర్లు, నేరడిగొండ మండలంలో 9.90మీటర్లు, గుడిహత్నూర్‌లో 9.62మీటర్ల లోతుకు పడిపోవడం పరిస్థితి తీవ్రకు అద్దం పడుతోంది. భూగర్భజలాలు పడిపోవడం మూలంగా స్థానిక నీటివనరులైన వాగులు ఎండిపోవడం, బావులు అడుగంటిపోవడం కారణంగా మనుషులు, మూగజీవాలు తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తాయి. మరోపక్క చేతిపంపులు సైతం పనిచేయని పరిస్థితికి చేరుకున్నాయి. సుమారు గంట పాటు కొడితే బిందెడు నీళ్లు వచ్చే పరిస్థితికి చేరుకున్నాయి. దీంతో అనేక గ్రామాల్లో తాగునీటి కోసం గంటల తరబడి చేతిపంపుల వద్ద వేచిచూడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

సక్రమంగా సరఫరా కాని భగీరథ..!

ఇంటింటికి శుద్ధనీటిని అందించేందుకు గత ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకం పూర్తిస్థాయిలో ఫలితం ఇవ్వడం లేదు. ప్రతి ఏటా పైప్‌లైన్ లీకేజీలు, మోటార్లు పనిచేయకపోవడం, పంప్‌హౌస్‌ల్లో సమస్యల కారణంగా తాగునీటి సరఫరాకు తరుచూ ఆటంకం ఏర్పడుతోంది. అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించలేని కారణంగా సమస్యలు మరింత పేరుకుపోతున్నాయి. ఇప్పటికే ఏజెన్సీ ప్రాంతంలో తాగునీటి ఎద్దడి తీవ్రమైంది. ఇటీవల నార్నూర్ మండల కేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఇటీవల ధర్నా నిర్వహించారు. ఈ గ్రామంతో పాటు నాగల్‌కొండ, మరపగూడ, గుంజాలతో పాటు గాదిగూడ మండలం కేంద్రం, మేడిగూడ, కునికాస, కొత్తపెల్లి, ఖడ్కి, పర్సవాడ, పూనాగూడ తదితర గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు ప్రతి పదిహేను రోజులకు ఒకసారి సరఫరా అవుతోందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. వీటితో పాటు ఇంద్రవెల్లి, తలమడుగు, బజార్‌హత్నూర్, సిరికొండ తదితర మండలాల్లోని మారుమూల గ్రామాల్లో ఇప్పుడే తాగునీటి తాపం ప్రారంభమైంది.

భవిష్యత్తులో మరింత ముప్పు..!

మార్చి ప్రారంభంలోనే భూగర్భజలాలు పడిపోవడంతో రానున్న రోజుల్లో మరింత తీవ్రమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం ఎండలు మండిపోవడంతో మనుషులతో పాటు పశుపక్ష్యాదులు సైతం అల్లాడిపోతున్నాయి. రానున్న రోజుల్లో భూగర్భజలాలు మరింత అడుగంటిపోతే పరిస్థితి దుర్భిక్షంగా మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాహం తీర్చుకునేందుకు కూడా ఆపసోపాలు పడే పరిస్థితి వస్తుందని తెలుస్తోంది. అధికార యంత్రాంగం ముందస్తుగా మేల్కొని మిషన్ భగీరథ పథకంపై దృష్టిసారించడం.. ఎక్కడికక్కడ పైప్‌లైన్ల మరమ్మతులు, లీకేజీలను సరిచేయడం వంటి చర్యలు చేపడితేనే తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉన్నతాధికారులు ఇప్పటికైనా ఈ పరిస్థితులపై దృష్టిసారించి ముందస్తు ప్రణాళికతో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే జిల్లావాసులు తీవ్ర తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనే పరిస్థితులు తలెత్తుతాయని తెలుస్తోంది.



ఉట్నూర్ మండలం ఉదానాయక్‌తండాలో పని చేయని చేతిపంపు



నార్నూర్‌లో నీటి కోసం నిరసన తెలుపుతున్న గ్రామస్తులు (ఫైల్)

ఎలక్టోరల్ బాండ్ల వివరాలు వెంటనే ఇవ్వాలని ఎస్‌బీఐల ముందు సీపీఐ(ఎం) ధర్నాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్, నిర్మల్

ఎలక్టోరల్(ఎన్నికల) బాండ్ల వివరాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా కేంద్రాల్లో ఎస్‌బీఐల ముందు ధర్నా చేపట్టారు. ఎన్నికల బాండ్లను రద్దు చేస్తూ ఆ వివరాలు వెంటనే అందజేయాలని సుప్రీం కోర్టు ఎస్‌బీని ఆదేశించిన విషయం తెలిసిందే. ఎస్‌బీఐ బీజేపీ ఒత్తిడితో ఇప్పటి వరకు సుప్రీం కోర్టుకు వివరాలు అందజేయడం లేదని నిరసిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. ఆదిలాబాద్‌లో శివాజీ చౌక్‌లోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి డి.మల్లేష్ మాట్లాడుతూ ఎస్‌బీఐ ప్రజల బ్యాంకుగా కాకుండా బీజేపీ బ్యాంకుగా వ్యవహరిస్తోందని మండి పడ్డారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను సైతం ఎస్‌బీఐ బేఖాతరు చేయడం క్షమించరాని నేరమన్నారు. బీజేపీ అన్ని వ్యవస్థలను తన గుప్పెట్లో పెట్టుకున్నట్లు ఎస్‌బీఐని కూడా పెట్టుకున్నట్టు కనిపిస్తోందని తెలిపారు. ఎన్నికల బాండ్లతో వేల కోట్లు వసూలు చేసిన బీజేపీ తన బండారం బయట పడుతుందన్న భయంతోనే వివరాలు వెల్లడించకుండా ఎస్‌బీఐపై ఒత్తిడి చేస్తోందని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఎస్‌బీఐ వెంటనే ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, పూసం సచిన్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.మంజుల, నాయకులు లింగాల చిన్నన్న, లంక జమున, కోవ శకుంతల, పొచ్చక్క, ఎస్,స్వామి, కె.ఆశన్న, ప్రభు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ చైర్మన్‌ను అరెస్ట్ చేయాలి

సుప్రీం కోర్టు ఆదేశం మేరకు ఎస్‌బీఐ ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని, మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వత్తాసు పలుకుతున్న చైర్మన్‌ను అరెస్టు చేయాలని సీపీఐ(ఎం) నిర్మల్ జిల్లా కార్యదర్శి గౌతమ్‌కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల వ్యవస్థను, రాజ్యాంగ విలువలను దిగజార్చే రీతిలో మోడీ ప్రభుత్వం దేశంలోని కార్పొరేట్ సంస్థల నుండి వేల కోట్లు వసూలు చేసిందన్నారు. ఈ విధానం సరైంది కాదని సీపీఐ(ఎం)తో పాటు మేధావులు సుప్రీంకోర్టును ఇటీవల ఆశ్రయించారన్నారు. ఎన్నికల బాండ్‌ల విధానం సరైంది కాదని, దీన్ని రద్దు చేస్తూ ఇప్పటి వరకు ఎస్‌బీఐ ద్వారా ఏ పార్టీకి ఎంత సొమ్ము ముట్టిందనే వివరాలు తక్షణమే బహిర్గతం చేయాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. వెంటనే ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయని పక్షంలో ఎస్‌బీఐ చైర్మన్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మెన సురేష్, డాకూర్ తిరుపతి, జిల్లా కమిటీ సభ్యులు, పట్టణ కార్యదర్శి ఫసివుద్దీన్, నాయకులు గంగాధర్, సాయికిరణ్, అబ్దుల్ మసీద్, అబ్బాస్, షాదుల్లా షేక్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నవీన్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్ : సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎస్బీఐ చైర్మన్ ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని, మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వత్తాసు పలుకుతున్న చైర్మన్‌ను అరెస్టు చేయాలని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి ముంజం ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్బీఐ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థను రాజ్యాంగ విలువలను దిగజార్చే రీతిలో మోడీ ప్రభుత్వం దేశంలోని కార్పొరేట్ సంస్థల యజమానులతో కుమ్మక్కైందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్. తిమ్మారావు, ఊట్ల రవి, నితీశ్ పాల్గొన్నారు.

జైపూర్ : బీజేపీ ప్రభుత్వానికి ఎస్‌బీఐ సొంతం అన్నట్టు ఎన్నికల బాండ్లను దాచి పెట్టడం ఏమిటని సీపీఐ(ఎం) నాయకులు ప్రశ్నించారు. సోమవారం చెన్నూర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ బీజేపీ ఎలక్టోరల్ బాండ్ల పేరుతో కార్పొరేట్ సంస్థల నుండి సుమారు రూ.7వేల కోట్లు సేకరించిందన్నారు. ఎన్నికల బాండ్లను రద్దు చేసి మార్చి 6నాటికి బాండ్ల వివరాలన్నీ ఎలక్షన్ కమిషన్‌కు ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశించిందన్నారు. కానీ ఎస్బీఐ బీజేపీ మోడి ప్రభుత్వానికి సొంత బ్యాంకు అన్నట్లుగా వ్యవహరిస్తూ బాండ్ల వివరాలు ఇవ్వడం లేదని తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఎన్నికల బాండ్ల వివరాలు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బోడంకి చందు, నాయకులు ఉమారాణి, సమ్మక్క, నగేష్, బండారి రాజేశ్వరి, నాగజ్యోతి, చంద్రన్న, భూదేవి, పద్మ, మధునక్క, రాజన్న సంతోష్, జీవిత, హర్ష చంద్రకళ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో..



నిర్మల్‌లో..



కాగజ్‌నగర్‌లో..



జైపూర్ : చెన్నూర్‌లో..

సమస్యలు పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యం

కలెక్టరేట్ ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం నిరసన

ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లంక రాఘవులు అన్నారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో కాలనీవాసులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కాలనీలో మౌళిక వసతులు కల్పించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా లంక రాఘవులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్‌నగర్ కాలనీలో మౌళిక వసతులు లేక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై అధికారులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందన్నారు. జిల్లా కేంద్రంలోని కాలనీలో సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే కాలనీలో రోడ్డుతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి, నాయకులు ఆశన్న, కాలనీ వాసులు ప్రభు, రేణుక, ఛాయాబాయి, మహానంద, శంకర్, భాగ్యశ్రీ పాల్గొన్నారు.



వంతెన, రోడ్డు నిర్మాణానికి నేడు సీపీఐ(ఎం) పాదయాత్ర

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రానికి సమీపంలో గల జోడు వాడుపై వంతెన నిర్మించడంతో పాటు ఇరువైపుల రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మంగళవారం పాదయాత్ర చేపడుతున్నామని నాయకులు తెలిపారు. జోడు వాగు నుండి భీమారం తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర ఉంటుందన్నారు. ఈ విషయమై సోమవారం విలేకరులతో మాట్లాడారు. సంవత్సరాలుగా సాగదీస్తున్న జాతీర రహదారి నిర్మాణంలో భాగంగా జోడు వాగుపై వంతెన నిర్మించాల్సి ఉండగా నిర్మాణపు పనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కారణంగా అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రజాప్రతినిధులు వంతెన నిర్మాణంలో నిర్లక్ష్యం వీడి వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రకు సీఐటీయూ, కేవీపీఎస్, టీఏజీఎస్, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యుయూ, ఐద్వా, మత్స్య కార్మిక సంఘాలు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దూర్కె మోహన్, సీపీఐటీయూ కావేరి రవి, రాతిపల్లి నగేష్, టీఏజీఎస్ నాయకులు సిడాం సమ్మక్క, గావిడి భూదక్క, ఐద్వా నాయకురాలు బండారి రాజేశ్వరి, బోగె నాగజ్యోతి, సామల ఉమారాణి, డీవైఎఫ్ఐ నాయకులు తాండ్ర అనిల్, మహేష్, నాయకులు కందారపు చంద్రన్న బండారి శ్రీనివాస్, బోగె సత్తయ్య, బొందయ్య పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | మార్చి 12, 2024 | www.navatelangana.com

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

నవతెలంగాణ-నార్నూర్

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు అన్నారు. సోమవారం మండలంలోని బేతాల్‌గూడ గ్రామ పంచాయతీలో కుష్టు నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 11 నుంచి 24 వరకు 15 రోజుల పాటుగా గ్రామాల్లో కుష్టు వ్యాధి పైన ఇంటింటికి సర్వే చేయడం జరుగుతుందన్నారు. ఐదు మంది సూపర్‌వైజర్లు 53 మంది ఆశాలతో టీం ఏర్పాటు చేసి,



సర్వే నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కుష్టు వ్యాధి ముఖ్యంగా చర్మానికి నరాలకు సోకుతుందన్నారు. కుష్టు వ్యాధి నెమ్మదిగా పెరిగి, వ్యాధి లక్షణాలు బహిర్గతం కావడానికి సగటున 3 నుంచి 5 సంవత్సరాల వరకు పడుతుందన్నారు. వైద్య శిబిరంలో సూపర్‌వైజర్లు చౌహన్ చరణ్‌దాస్, రాజమ్మ, వైద్య సిబ్బంది మాన్కుబాయి ఉన్నారు.

పేదల ఆకలి తీర్చడం కోసమే బొజ్జన్న బువ్వ

నవతెలంగాణ-ఉట్నూర్

సుదూర ప్రాంతాల నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే అర్జీదారుల ఆకలిని తీర్చడమే బొజ్జన్న బువ్వ ముఖ్య లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అచ్చ దేవానందం అన్నారు. సోమవారం ఉట్నూరు మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట బొజ్జన్న బువ్వ అన్నదానం నిర్వహించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు ఈ అన్నదానం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి సోమవారం ఈ అన్నదానం ఉంటుందని తెలిపారు. ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే అర్జీదారులు అన్నదాన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెడ్మ బొజ్జు యువసైన్యం సభ్యులు మెస్రం నగేష్, అక్షయ్, సాయి, మహేందర్, పరమేశ్వర్, నందు, మహిళలు పాల్గొన్నారు.



శ్రమను దోచుకుంటున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

- కలెక్టరేట్ ఎదుట కార్మికుల ఆందోళన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్మికుల శ్రమను దోచుకుంటున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రిమెంట్ తో పాటు జీఓ నెంబర్ ఎంఎస్ 60 ఆధారంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీని కోసం గత మూడు రోజులుగా రిమ్స్ ఎదుట సమ్మె చేస్తున్న కాంట్రాక్టర్, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అగ్రిమెంట్ ప్రకారం రూ.1293 చెల్లించాలని, కానీ కాంట్రాక్టర్ మాత్రం రూ.11వేలు చెల్లించి, కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోని, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎండీ ముజీబ్, సంగీత, ఎండీ ఖాసీం, చందు, లక్ష్మీ, సునీత, రుక్మిణి, సైఫ్ ఖాన్, ఇమ్రాన్ ఖాన్, జక్కుల రాము, వెంకటేశ్ పాల్గొన్నారు.

పేద ముస్లిములకు ఇబ్బందులు కలగకుండా పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పవిత్ర రంజాన్‌ను పురస్కరించుకొని పేద ముస్లీం కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సరకులను పంపిణీ చేస్తున్నామని సఫాబైతుల్ మాల్ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ ముబాషిర్ అహ్మద్ అన్నారు. సోమవారం పట్టణంలోని టీఎన్జీఓ గార్డెన్‌లో సంఘం తరపున గుర్తించిన పేదలకు రంజాన్ ప్యాకేజీలను అందించారు. ఈ సందర్భంగా సఫాబైతుల్ మాల్ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ ముబాషిర్ అహ్మద్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఉండే పేద ముస్లీం కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు కలగవద్దనే నిత్యావసర సరకులను అందిస్తున్నామన్నారు. దాతల సహకారంతో సంఘం తరపున గుర్తించిన పేదలకు వీటిని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. దాతలు ముందుకు వచ్చి తమకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మౌలానా మహ్మద్ ముస్తాఫా, హఫీజ్ బసీర్ అహ్మద్, హఫీజ్ ఖాజీం, మంజూర్ అహ్మద్, అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-ఉట్నూర్

ఎన్‌ఆర్‌ఈజీఎస్‌తో చేపట్టిన సైడ్ డ్రైనేజీ నిర్మాణానికి వైస్ ఎంపీపీ ధవలే బాలాజీ భూమిపూజ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో కూడిన పనులను గ్రామాభివృద్ధికి ఖర్చు చేస్తున్నామని అన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నా వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

డీఎస్సీ, ఎస్జీటీ ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డీఎస్సీ, ఎస్జీటీ ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్టు బీసీ అభివృద్ధి అధికారి రాజలింగు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు ఈ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్‌స్టడీసర్కిల్.సీజీజీ.గావ్.ఇన్ ద్వారా మార్చి 14 నుంచి 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 26 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రిజర్వేషన్ ప్రకారం ఎస్‌జీటీ సంబంధించి ఇంటర్మీడియట్, డైట్, టెట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఈ ఉచిత శిక్షణ 75 రోజులు ఉంటుందన్నారు. నిపుణులైన అధ్యాపకుల చేత శిక్షణ ఉంటుంది. ప్రతిరోజు, వారంతపు, పూర్తి పరీక్షలు నిర్వహించబడును. మరిన్ని వివరాలకు 08732221280, 9949684959 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ పరీక్షకు 695 మంది గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం నిర్వహించిన ఫస్ట్ ఇయర్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు 695 మంది గైర్హాజరైనట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 10, 345 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 9,650 మంది హాజరైనట్టు ఆయన వెల్లడించారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను ఆమె స్వీకరించారు. ఉట్నూర్ మండలం శాంతినగర్ గ్రామానికి చెందిన సెడ్మకి రవిబాబు తనకి జిరాక్స్ ఇప్పించాలని, ఇచ్చోడ మండలం దుబార్‌పేట్ గ్రామానికి చెందిన హనుమంతు పాఠశాలలలో అడ్మిషన్స్ కావాలని, ఇంద్రవెల్లి మండలం కేస్లాగూడ గ్రామానికి చెందిన జయశ్రీ తనకి కిరాణా దుకాణం కావాలని కోరారు. పింఛన్, ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు అందజేశారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీఓ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో ఏపీఓ కనక భీంరావు, డీడీ దిలీప్ కుమార్, ఈఈ భీంరావ్, అదనపు వైద్యాధికారి కుంరం బాలు, ఆర్సీఓ గంగాధర్, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీఓ ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలి

- కలెక్టరేట్ల ఎదుట మధ్యాహ్న భోజనం కార్మికుల ధర్నా



నవతెలంగాణ-నిర్మల్

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలు. చెల్లించాలనీ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. సోమవారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులకు ఐదు నెలల నుంచి బిల్లులు, 9నెలల నుంచి కోడిగుడ్ల బిల్లులు, సుమారు 7నెలల వేతనాలు రాక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు అప్పులు తెచ్చిన దగ్గర వడ్డీలు కట్టలేక పస్తులు ఉండి విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాలను అందిస్తున్నారని తెలిపారు. ఈ పథకంతోనే పాఠశాలలో డ్రాపవుట్స్ తగ్గాయని తెలిపారు. హాజరు శాతం పెరుగుతుందని అనేక నివేదికలు తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. కానీ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు సరైన సమయంలో బిల్లులు ఇవ్వడం లేదని, వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులను, వేతనాలను చెల్లించి అంగన్‌వాడీ కేంద్రాల మాదిరిగా ప్రభుత్వమే గుడ్లను సరఫరా చేయాలని అన్నారు. వంటకు సరిపడా గ్యాస్‌ను ప్రభుత్వమే పూర్తిగా సబ్సిడీపై ఇవ్వాలని, కాటన్ దుస్తులను డ్రెస్ కోడ్‌గా ఇవ్వాలని, ప్రొసీడింగ్ ఆర్డర్స్, గుర్తింపు కార్డులను, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధ, ఉపాధ్యక్షులు లక్ష్మి సాయవ్వ, చంద్రకళ, రాజమణి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం, కోడి గుడ్ల బిల్లులు, అల్పాహారం బిల్లులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు లింగాల చిన్నన్న అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.10వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. పెండింగ్ బిల్లులు, కొత్త మెనూను సవరించాలని అన్నారు. కోడి గుడ్డుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని పేర్కొన్నారు. అవసరమైన గ్యాస్‌ను సబ్సిడీతో ఇవ్వాలన్నారు. గుర్తింపు కార్డులు, కాటన్ బట్టల యూనిఫాం ఇవ్వాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, అడెల్ల, అశ్విని, మీరాబాయి, లావణ్య పాల్గొన్నారు.

రూ.లక్షతో పాటు తులం బంగారం అందించాలి

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్



నవతెలంగాణ-తలమడుగు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆడబిడ్డల పెండ్లిలకు లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఆడపిల్లల కుటుంబాలకు అందించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రారంభించిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంతో అనేకమంది పేద కుటుంబాలకు పెద్దన్నయ్యగా పేద కుటుంబాలకు అండగా నిలిచి వివాహాలు జరిపించిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. సోమవారం ఖోడద్ గ్రామంలో ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ముఖ్యఅతిథిగా హజరైన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం పేదవారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే పథకం అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 43 మంది ఆడపిల్లల కుటుంబాలకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం అదే గ్రామంలో రూ.14 లక్షలతో కొత్తగా నిర్మిస్తున్న సైన్స్ ల్యాబ్ భవనానికి భూమిపూజ చేశారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో బాగా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకొని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కన్న కలలు నెరవేర్చాలన్నారు. ఊరికి మంచి పేరు తేవాలని విద్యార్థులను కోరారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో స్థలం తక్కువగా ఉండటం గ్రామ వాస్తవ్యులు గ్రామ పెద్దలు చిలుకూరి లక్ష్మారెడ్డి సైన్స్ ల్యాబ్ తన వ్యవసాయ భూమిని పాఠశాలకు విరాళంగా ఇవ్వడం అభినందనీయమని అన్నారు. వారి దాతృత్వానికి అభినందనలు తెలియజేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి అభ్యర్థన మేరకు పాఠశాలకు ప్రహరీ గోడ, వంట షెడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చారు. పదో తరగతి విద్యార్థులకు కృష్ణ కుమారి, విలాస్‌గౌడ్ దంపతులు అందించిన పరీక్ష ప్యాడ్‌లను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మండల తహసీల్దార్ రాజమోహన్, మండలాభివృద్ధి అధికారి శేఖర్, ఎంఈఓ నారాయణ, మాజీ సర్పంచ్ సాకి ఆనంద్, స్థలదాత చిలుకూరి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తోట వెంకటేష్, కేదారీశ్వర్ రెడ్డి, పురుషోత్తం, అభిరామ్‌రెడ్డి, గంగాధర్, సుదర్శన్‌రెడ్డి, నల్ల దేవిదాస్, రంజిత్‌రెడ్డి, రమాకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల పంచాయతీ కార్యాలయ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ కార్యాలయాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న మహిళలను ఎంపీడీఓ అరుణారాణి, మండల పంచాయతీ అధికారి అజీజ్‌ఖాన్ ఘనంగా సన్మానించి, మెమోంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ అక్షర అనిల్ మాట్లాడుతూ ఆడదంటే అబల కాదు సబల అని ఎందరో మహిళలు తమ ప్రతిభ శక్తులతో నిరూపిస్తున్నారని అన్నారు. ఆడది అబల అనే పదాలు తమను ఎంతగానో బాధించాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీ లేకపోతే ప్రపంచమే లేదని, ప్రపంచానికి ఆధారం మహిళ అంటూ స్థానిక తహసీల్దార్ స్వాతి కొనియాడారు. మహిళలు చదువుతోపాటు ఆత్మరక్షణ విద్యలను నేర్చుకోవాలని ఎంపీడీఓ ఆరుణారాణి సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు సమానంగా రాణించాలని ఎస్సై సుమలత తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం సులోచనరెడ్డి, ఏపీఓ దివ్యరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ పుష్ప, గ్రామపంచాయతీల మహిళా కార్యదర్శిలు, మండల పరిషత్ సిబ్బంది, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధికి సహకరిద్దాం

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్



నవతెలంగాణ-తాంసి

పార్టీలకు అతీతంగా అందరం కలిసి భీంపూర్ మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడానికి సహకరించుకుందామని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం రూ.18 కోట్ల నిధులతో ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణానికి భీంపూర్ మండలంలోని దనోరా వరకు రోడ్డు నిర్మాణానికి డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలు ఏవైనా మండలాభివృద్ధి కృషి చేద్దామని అన్నారు. గతంలో రూ.18 కోట్ల ఆర్ అండ్ బి నిధులు సవర్గాం నుంచి కరంజి(టి) వరకు సింగిల్ రోడ్ మంజూరు కావడం జరిగిందన్నారు. కానీ కొంతమేరనే పనులు జరిగి మిగతా పనులు నిలిచిపోయాయని అన్నారు. దీంతో మండలవాసులు ఆందోళన చెందడంతో పాటు డబుల్ రోడ్డు నిర్మించాలని కోరారు. దీనికి మరో రూ.20 కోట్లు నిధులు మంజూరు కొరకు కృషి చేస్తామని అన్నారు. దాదాపు తొమ్మిది కిలోమీటర్ల వరకు డబుల్ బీటీ రోడ్డు పనులు కొనసాగుతాయని అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 25 కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్, ఎంపీపీ రత్నప్రభ సంతోష్, వైస్ ఎంపీపీ లస్మన్న, కన్వీనర్ నాగయ్య, మండల నాయకులు సంజీవరెడ్డి, మహేందర్, కల్చప్ యాదవ్, అనీల్, అఫ్రోజ్, ఉన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

పదో తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని ఆర్ఆర్ ట్రస్ట్ చైర్మెన్, కాంగ్రెస్ యువ నాయకుడు రాజేష్ నాయక్ అన్నారు. సోమవారం ఉట్నూర్ పట్టణంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలలో చదువుకుంటున్న 92 మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు తమ ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాదవ్ రమేష్, ఉపాధ్యాయులు టీటీఫ్ జిల్లా అధ్యక్షులు జాదవ్ రవీందర్, విద్యార్థులు ఉన్నారు.

కుష్టు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- వ్యాధి సర్వేను ప్రారంభించిన డీఎంఅండ్‌హెచ్ఓ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కుష్టు వ్యాధి రహిత జిల్లాగా ఆదిలాబాద్‌ను తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. సోమవారం కుష్టు వ్యాధి గుర్తింపు సర్వేను చిల్కూరి లక్ష్మీనగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలో ఇంటింటికి తిరుగుతూ వివరాలను సేకరించారు. వ్యాధి లక్షణాల గురించి అడిగి తెలుసుకుంటూ వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ సమాజంలో కుష్టు వ్యాధిని శాపంలా భావిస్తున్నారన్నారు. మూఢ నమ్మకాల కారణంగా వ్యాధి గ్రస్తులను బహిష్కరిస్తున్నారని తెలిపారు. ముందుగానే వ్యాధిని గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా నయం చేయవచ్చని తెలిపారు. ఎలాంటి స్పర్శ లేని మచ్చలుంటే ఇంటికి వచ్చే వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. జిల్లాలో సోమవారం నుంచి 24 వరకు 14 రోజుల పాటు గుర్తింపు సర్వే ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎయిడ్స్ అండ్ లెప్రసీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ గజానంద్, యూపీహెచ్‌సీ వైద్యురాలు దీపిక, డీఎంవో వామన్‌రావ్, ఎల్టీ రమణచారి, సీఓ విష్ణు, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

పార్డి(బి)లో మార్మోగిన శివ నామస్మరణ

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పార్డి(బి) గ్రామంలో శ్రీ రాజరాజేశ్వర మందిరంలో గత మూడు రోజుల నుంచి శివరాత్రి సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం రాజరాజేశ్వరున్ని దర్శించుకోవడానికి నిర్మల్ జిల్లాలోని బైంసా, ముధోల్, తనూర్, లోకేశ్వరం, బాసరతో పాటు ఆదిలాబాద్, నిజామాబాద్ నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి రాజరాజేశ్వరునికి మొక్కిన మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం 6గంటలకు నిర్వహించే అంబలి కుండలను నెత్తిపైన పెట్టుకొని దానిపైన దీపాలను వెలిగించుకొని రాజరాజేశ్వరుని ప్రదక్షిణలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. అదే విధంగా ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వి.మోహన్ గ్రామపెద్దలు రాజేశ్వర్, చిమ్మన్ పోశెట్టి, బి సంతోష్, మాజీ సర్పంచ్ నాగుల మల్లన్న, రాజన్న లక్ష్మీకాంత్, గ్రామస్తులు, యువకులు ఉన్నారు.

నేడు పాఠశాల ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గిరిజన క్రీడా పాఠశాల ప్రవేశాల ఎంపిక పోటీలను ఈనెల 12న ఉట్నూరులోని కుమురంభీమ్ కాంప్లెక్స్‌లో ఈనెల 12న ఉదయం 8:30 గంటలకు గిరిజన క్రీడా పాఠశాలలో ప్రవేశాల కోసం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు ట్రైబల్ స్పోర్ట్స్ అధికారి పార్థసారథి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉట్నూరు, ఆసిఫాబాద్ గిరిజన ఆదర్శ క్రీడ పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశాల కోసం గిరిజన బాల, బాలికలకు జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తామని, అందులో మెరిట్ సాధించిన వారిని ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. 5, 6, 7వ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లను సైతం ఇదే వేదికపైన ఎంపిక పోటీలు నిర్వహించి భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి అర్హత ఉన్న విద్యార్థులు ఈ ఎంపిక పోటీలకు హాజరుకావాలని సూచించారు.

రంజాన్ పండుగ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

రంజాన్ పండుగ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. రంజాన్ నెల ప్రారంభ నేపథ్యంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆయన సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రశాంత వాతావరణం రంజాన్ పండుగను నిర్వహించుకొనేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఎటువంటి పుకార్లను ప్రజలు నమ్మవద్దని అన్నారు. పుకార్లను వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పండగ నిర్వహణకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనియ ఘటనలు జరుగకుండా ప్రజల భాగస్వామ్యంతో రంజాన్ పండుగను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో డీఆర్ఓ గంగయ్య, ఆర్డిఓలు రత్నాకళ్యాణి, మున్సిపల్ కమిషనర్ రాజు, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దు



నవతెలంగాణ-నిర్మల్

మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాజీ ఎంపీపీ సాదా సుదర్శన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.గత పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో అధికార దాహంతో అవినీతి అక్రమాలకు పాల్పడిన మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవద్దని అన్నారు. గత 30 ఏండ్లుగా అధికారం కోసం పార్టీలు మారే చరిత్ర ఇంద్రకరణ్ రెడ్డిదేనని మండిపడ్డారు. గత పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వంలో ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జా చేసిన ఘనత మాజీ మంత్రిదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతికి పాల్పడిన ఐకే రెడ్డిని నిర్మల్ నియోజకవర్గ ప్రజలు చిత్తుగా ఓడించారని గుర్తు చేశారు. పదవి కోల్పోయి మూడు నెలలు కూడా కాలేదని అప్పుడే పార్టీ మారెందుకు ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటని అన్నారు. ఇలాంటి భూకబ్జాల మాజీ మంత్రిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దని రాష్ట్ర అధినాయకత్వానికి తీర్మానం చేసి పంపుతామని తెలిపారు. అలాగే మండలంతో పాటు జిల్లాలోని అన్ని మండలాల నాయకులతో చర్చలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడే మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఉట్నూర్

మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు అధ్యక్షతన మంగవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హజరు కావాలని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం | మార్చి 12, 2024 | www.navatelangana.com

అదనపు ఎస్పీగా ప్రభాకర్‌రావు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్)గా ఆర్.ప్రభాకర రావు బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీగా పని చేసి బదిలీపై ఆసిఫాబాద్ జిల్లా కి వచ్చారు. అయితే ఇప్పటి వరకు ఈ స్థానంలో కొనసాగిన అచ్చేశ్వరరావు ఎన్నికల బదిలీలో భాగంగా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో వచ్చిన ప్రభాకరరావ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అందించిన దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావు, కాగజ్‌నగర్ ఆర్డీఓ సురేష్‌తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెద్దవాగులో గల్లంతైన యువకుని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-రెబ్బెన



పెద్దవాగులో ఆదివారం సాయంత్రం గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైంది. మండలానికి చెందిన ఐదుగురు స్నేహితులు మాధవాయిగూడ సమీపంలోని పెద్దవాగులో ఈతకు వెళ్లారు. తెలవరాజ్ కుమారుడైన విఘ్నేష్(21) ఆదివారం సాయంత్రం గల్లంతైయ్యాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ, సీఐ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్ల సాయంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి కావడంతో ఆచూకీ దొరకలేదు. ఉదయం 10 గంటలకు కాగజ్‌నగర్ రూరల్ పోలీసులు, తహసీల్దార్ జ్యోష్ణ గాలింపు చర్యలు చేపట్టగా విఘ్నేష్ మృతదేహం లభ్యమైనట్టు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించినట్టు తెలిపారు.

రంజాన్ మాసంలో మినహాయింపులు ఇవ్వాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్


రంజాన్ ఉపవాస దీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పోలీసులు కొన్ని మినహాయింపులు ఇవ్వాలని ముస్లిం వెల్ఫేర్ సొసైటీ నాయకులు కోరారు. సోమవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఉబేద్ బిన్ యహీయా (తారీక్) మాట్లాడుతూ రంజాన్ మాసంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా, చలాన్ల విషయంలో మినహాయింపు ఇవ్వాలని కోరారు. రాత్రి సమయంలో టీ స్టాల్‌లకు, హోటల్‌లు నడుపుకొనడానికి అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ ముబాసిర్, మహమ్మద్ ఖలీల్, మహమ్మద్ అఫ్జల్, ఎండి ఇజజ్ పాల్గొన్నారు.

టీఎన్జీఓ రాష్ట్ర కమిటీ ఎన్నికలలో జిల్లా నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సెంట్రల్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ పాల్గొన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని టీఎన్జీఓ భవన్‌లో జరిగిన ఎన్నికల్లో పాల్గొని రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మారం జగదీశ్వర్ సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలోని టీఎన్జీఓల సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

లక్షెటిపేట మున్సిపల్ వార్షిక బడ్జెట్ రూ.12.14 కోట్లు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెట్టిపేట పురపాలక సంఘం 2023-24 ఆర్థిక సంవత్సరం రూ.12.14 కోట్లకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సోమవారం 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రత్యేక సమావేశాన్ని చైర్మెన్ నల్మాస్ కాంతయ్య అధ్యక్షతన నిర్వహించారు. సీహెచ్ అనితా దేవి, జేఏఓ బడ్జెట్ ఎజెండాను చదివి వివరించగా కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. ఈ సమావేశములో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, కమిషనర్ కల్లెడ రాజశేఖర్, మంచిర్యాల వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చల్ల నాగభూషణం, కౌన్సిల్ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

- ఇప్పటి వరకు 70 శాతం పూర్తి
- గడువులోగా పూర్తికి కృషి

నవతెలంగాణ-కెరమెరి

పల్లెలు అభివృద్ధి చెందాలంటే గ్రామస్తులే కీలకం. వారు చెల్లించే పన్నులతో గ్రామాలు సమగ్రాభివృద్ధి చెందుతాయి. గ్రామాల్లో మౌళిక వసతుల కల్పన, అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న 14, 15వ ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ నిధులతో పాటు గ్రామాల్లోని ఇంటి, వాణిజ్య సముదాయాలు చెల్లించే పన్నులు కీలకంగా మారుతాయి. ప్రజలకు వసతులు కల్పించాలంటే ఇందుకు అవసరమైన నిధులను గ్రామాల్లో ఏటా ఇంటి పన్నులు వసూలు చేయడం తప్పనిసరిగా భావిస్తున్నారు. ఇంటి పన్ను వందశాతం వసూలు చేయాలని పంచాయతీ సిబ్బంది నిర్ణయించారు. ఇప్పటికే కెరమెరి మండలంలోని ఆయా గ్రామాల్లో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేస్తున్నారు. సెలవు దినాల్లోను పని చేస్తు 70 శాతం వసూళు పూర్తి చేశారు.

31 జీపీల్లో ముమ్మరంగా వసూళ్లు

మండలంలో 31 పంచాయతీలున్నాయి. గత ఆర్థిక సంవత్సరం 100 శాతం పన్నులు వసూలు చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరం మార్చి 31వ తేదీతో ముగియనుండడంతో గ్రామాల్లో ఇంటి పన్నుల వసూలుపై పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇప్పటికే 70 శాతం వసూలు చేశారు. గోండుగూడ 100 శాతం, నిషాని, కెలిబి, మెట్టపిప్రి, రింఘన్ ఘాట్, సాకడ, అగర్వాడ, బాబేఝరి, బోరిలాల్ గూడ, దేవాపూర్ ముఖద్దం కూడా, పరందోలి, మోడీ, ఫార్ధ జీపీల్లో 90 శాతంపైగా వసులయ్యాయి. కేస్లాగూడ, సాంగ్వి, అంతపూర్, ఖైరి, కొఠారి గ్రామాల్లో 80శాతం పైగా అనార్ పల్లి, కెరమెరి, సుర్ధాపూర్, గోయగాం, తుమ్మగూడ, ధనోర, జోడేఘాట్, కరంజి వాడ, సావర్ ఖేడ, బోలాపటార్, ఇందాపూర్, ఝరి జీపీల్లో 50 శాతంపైగా వసూలైంది. మండలంలో ఈ ఏడాది రూ.34,87,832 ఉండగా ఇప్పటివరకు రూ.26,20567 ఇంటి పన్ను వసూలైంది. ఇంకా రూ.11,17265 వసూలు కావాల్సి ఉంది. ఈ ఏడాది మండలంలోని అన్ని గ్రామాల్లో 100 శాతం పన్ను వసూలుకు ప్రజాప్రతినిధుల సహకారంతో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి ఇంటి పన్ను వసూలుకు కృషి చేస్తున్నారు.



కెరమెరిలో ఇంటి పన్ను చెల్లిస్తున్న వినియోగదారుడు



సుల్తాన్‌గూడలో ఇంటి పన్నులు చెల్లించిన వారికి రశీదులు అందిస్తున్న జీపీ సిబ్బంది

ఇంటి పన్ను చెల్లిస్తేనే గ్రామాల అభివృద్ధి

భీమయ్య, పంచాయతీ కార్యదర్శి, కెరమెరి



గ్రామాల్లో ఇంటి పన్ను వసూలుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. రోజు వారీగా వసూలు చేసిన పన్ను వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. 100 శాతం వసూలే లక్ష్యంగా గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నాం. పన్ను సక్రమంగా వసూలైనపుడే గ్రామాల అభివృద్ధికి దోహదపడుతుంది.

ఇంటి పన్ను చెల్లించి సహకరించాలి

అంజత్ పాషా, ఎంపీఓ, కెరమెరి



గ్రామాల్లో పేరుకపోయిన ఇంటి పన్ను వసూలుకు ప్రజలు సహకరించాలి. ఇప్పటికే 15 పంచాయతీల్లో 90 శాతం పూర్తి చేశాం. 17 పంచాయతీల్లో 50 నుంచి 88 శాతం వరకు పూర్తయ్యాయి. ఈనెల 20 వరకు మిగిలిన పంచాయతీల్లో స్పెషల్ డ్రైవ్‌తో 100శాతం పూర్తి చేస్తాం. ప్రజలు చెల్లించే డబ్బులతోనే గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతాం. ప్రజలు పన్నులు చెల్లించి అధికారులకు సహకరించాలి.

రీడింగ్ రూంను సద్వినియోగం చేసుకోవాలి



లైబ్రరీని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని ప్రజా కార్యాలయంలో ఏర్పాటు చేసిన లైబ్రరీ, రీడింగ్ రూంను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ సూచించారు. సోమవారం దివంగత ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తం రావు స్మారక లైబ్రరీ, రీడింగ్ రూమ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా కార్యాలయంతో ప్రజాబంధు పురుషోత్తం రావుకు గొప్ప అనుబంధం ఉండేదని, తన కార్యాలయాన్ని వారి స్మారకార్థం లైబ్రరీ కమ్ రీడింగ్ రూమ్ గా మార్చడం జరిగిందన్నారు. లైబ్రరీ కమ్ రీడింగ్ రూం ప్రతీరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తెరిచి ఉంటుందని, లైబ్రేరియన్ అందుబాటులో ఉంటారని తెలిపారు. నిరుద్యోగులు, పోటీ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, రాష్ట్ర ఓబీసీ మోర్చ కార్యవర్గ సభ్యులు గోలెం వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధోనీ శ్రీశైలం, అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్ర చారి, పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ ఈర్ల విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు న్యాయాధికారుల నియామకం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాజీ మార్గాన కేసుల పరిష్కారం కోసం ఈ నెల 16న జిల్లా కేంద్రంలోని న్యాయస్థానంలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహణ కోసం న్యాయాధికారులు, సభ్యులను నియమించినట్లు సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. యువరాజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీనియర్ సివిల్ జడ్జ్ కం అసిస్టెంట్ సెషన్స్ జడ్జ్ కోర్టులకు సంబంధించిన సివిల్, క్రిమినల్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టుకు చెందిన అన్ని రకాల కేసుల కోసం న్యాయాధికారిగా సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. యువరాజ, లోక్ అదాలత్ సభ్యులుగా ధీరజ్ భౌమిక్, ఎం. చరణ్ తేజ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు సంబంధించిన సివిల్, క్రిమినల్, కాంపౌండబుల్, ఎక్సైజ్, డ్రంకన్ డ్రైవ్, పిట్టి కేసుల పరిష్కారం కోసం న్యాయాధికారిగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జె. అనంతలక్ష్మి, లోక్ అదాలత్ సభ్యులుగా కె. కిషోర్, జె. విద్యాసాగర్‌లను నియమించడం జరిగిందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జాతీయ లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీవీ వరలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి అధికారులు, కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు తమతమ నివేదికలతో హాజరు కావాలని ఆమె కోరారు.

ఘనంగా శంకరుని జాతర

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని చిన్న బెండారా గ్రామ సమీపంలో గల శంకరుని ఆలయంలో జాతరను ఘనంగా జరుపుకున్నారు. ఈ జాతరకు ప్రజలు హాజరై తమ మొక్కులను తీర్చుకున్నారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన భజన బృందాలతో భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నులే నారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

- 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

నవతెలంగాణ-బెజ్జూరు



నిరుపేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. ఇతరుల వద్ద తక్కువ ధరకు కొని మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్పీ కె సురేష్‌కుమార్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులకు అందిన పక్కా సమాచారం మేరకు మండలంలోని రేషన్ దుకాణాల నుండి సేకరించిన బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నారన్న క్రమంలో సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని కుకుడ గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. కుకుడ గ్రామంలోని ఖతిఫ్ అహ్మద్ ఇంటిలో తనిఖీ చేసి తరలించుటకు సిద్ధంగా ఉన్న 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని బెజ్జూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించి అతనిపై కేసు నమోదుచేశామని సినట్టు టాస్క్‌ఫోర్స్ సీఐ సిహెచ్ రాణాప్రతాప్ తెలిపారు. ఈ తనిఖీలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పీసీ మధు, రమేష్, హోంగార్డు మహేష్, సంజీవ్ పాల్గొన్నారు.

కనిపించిన నెలవంక..

- నేటి నుంచి పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం
- ప్రార్థనలకు ముస్తాబైన మసీదులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ముస్లింల పవిత్ర మాసం రంజాన్ నేటి నుంచి ప్రారంభం కానుంది. సాధారణంగా రంజాన్ చంద్రుడు సౌదీ అరేబియాలో మొదటగా కనిపిస్తాడు. కాగా ఆదివారం అక్కడ కనిపించడంతో సోమవారం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభం అయ్యాయి. సోమవారం సాయంత్రం రంజాన్ చంద్రుడు కనిపించడంతో నేటి నుంచి రంజాన్ మొదటి ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయి.

నెల పాటు ఉపవాస దీక్ష

ముస్లింల అత్యంత పవిత్ర మాసం రంజాన్‌ను ప్రతి ముస్లిం అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరిస్తారు. నియమ నిష్టలతో ఉపవాస దీక్షలను చేపడతారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ కనీసం నీరు కూడా తాగరు. సరికదా నోట్లోని లాలా జలాన్ని కూడా మింగరు. అత్యంత కఠినంగా ఉపవాస దీక్షను చేస్తారు. భగవంతుడిని ప్రార్థిస్తారు.

నమాజ్ చేసే సమయం

రంజాన్ ఉపవాసం చేస్తూనే రోజులో సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ రోజులో ఐదు సార్లు నమాజ్ చేస్తారు. రాత్రి 8.30 గంటల నుంచి రాత్రి 10గంటల మధ్య సమయంలో అంటే సహర్ నుంచి ఇఫ్తార్ సమయం వరకూ రోజులో ఐదు సార్లు నమాజు చేస్తారు. తరావీహ్ నమాజులో ఖురాన్ చదువుతారు. ఈ నెల రోజుల్లో నఫిల్ చదివితే ఫరజ్ చదివినంత పుణ్యమని ఇస్లాం గ్రంథాల్లో ఉంది. రంజాన్ మాసం ముగిసిన తరువాత, ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్ జరుపుకుంటారు.

రంజాన్ కోసం ముస్తాబైన మసీదులు

రంజాన్ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని ముస్లింలు జిల్లాలోని ఆయా ప్రాంతాల్లోని మసీదులను ప్రార్థనల కోసం ప్రత్యేక హంగులతో ముస్తాబు చేశారు. మసీదులు నూతన శోభతో ఉపవాస ప్రార్థనల కోసం సిద్ధమయ్యాయి. మసీదులకు రంగులు వేయడంతో పాటు విద్యుత్ దీపాలంకరణలు, మరమ్మతులు పూర్తి చేశారు. అలాగే సహరీ, ఇఫ్తారీల ఏర్పాట్లు కూడా చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రత్యేక తారావీహ నమాజ్‌లను ఆచరించేందుకు మసీదుల్లో మసీదు కమిటీల అధ్యక్షుడు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

నేడు మహిళా శక్తి పథకం ప్రారంభం

- విజయవంతం చేయాలి : అదనపు కలెక్టర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మహిళ స్వయం సహాయక సంఘాల కోసం రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి పథకానికి శ్రీకారం చుట్టిందని, మంగళవారం హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో సీఎం ప్రారంభిస్తారని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సభకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లేలా అధికారులు చేపట్టాలని సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో గల ఆయన ఛాంబర్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రాజెక్ట్ అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి భిక్షాగౌడ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారం, అదనపు పిడి.రామకృష్ణ, ఆర్టీసీ డీఎం శ్రీధర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు కోటి రూపాయల వరకు రుణం, బీమా సౌకర్యం అందించడంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా జిల్లా నుండి 15 బస్సులలో 750 మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులను తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. జిల్లా బ్యానర్లు, ప్రతి ఒక్కరికి గుర్తింపు కార్డు, భోజన వసతి కల్పించాలని, ప్రతి బస్సుకు ఒక లైజన్ అధికారితో పాటు ఒక పోలీస్ కానిస్టేబుల్, ఆశ వర్కర్ ఉంటారని, పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఒక్కో గ్రామస్థాయి పరిధిలోని సంఘాలకు రూ. కోటి వరకు రుణ సదుపాయం కల్పిస్తున్న తరుణంలో సంఘాల బలోపేతంతో పాటు మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకెళతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాత్‌రూంలో పడి యువకుడి మృతి

వాంకిడి : మండలానికి చెందిన పెందోర్ చంద్రశేఖర్(34) ప్రమాదవశాత్తు బాత్‌రూంలో కాలుజారి పడి మృతిచెందాడు. ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన చంద్రశేఖర్ తన ఇంటిలో బాత్‌రూంకు వెళ్లి కాలుజారి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా పరిస్థితి విషమించడంతో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. తండ్రి సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలోని నిర్మిస్తున్న ప్రెస్ క్లబ్ భవనానికి ఎంపీ సోయం బాపూరావు తన నిధుల నుంచి రూ.4 లక్షలు మంజూరు చేసినట్లు, బీజేపీ మండల అధ్యక్షుడు గోలి చందు తెలిపారు. సోమవారం ఎంపీడీఓ శశికళకు ప్రొసిడింగ్ కాపీని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.4 లక్షల నిధులతో ప్రెస్ క్లబ్ భవనాన్ని పూర్తిగా నిర్మించి త్వరలో ప్రారంభిస్తామని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిలువేరు నరసయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ సోయం బాపూరావుకు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ధన్యవాదాలు తెలిపారు. ఆ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పడాల రాజశేఖర్, ప్రెస్‌క్లబ్ సభ్యులు మల్లేష్ పాల్గొన్నారు.

నీల్వాయి ఎస్సైగా శ్యామ్ పటేల్

నవతెలంగాణ-వేమనపల్లి



నీల్వాయి నూతన ఎస్సైగా శ్యామ్ పటేల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన సుబ్బారావు బదిలీపై రామగుండం వెళ్లగా, నెన్నెల నుండి శ్యామ్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నేరాలను అదుపు చేయడానికి తనవంతు కృషి చేస్తానని, చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రధానంగా యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు.

మున్సిపల్ అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల పురపాలక సంఘ అభివృద్ధికి అధికారులు, పాలకవర్గం సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల పురపాలక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 2024-25 ఆర్థిక సంవత్సరం సంబంధిత బడ్జెట్ ప్రత్యేక సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్, మున్సిపల్ కమీషనర్ మారుతిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ నల్ల మహేష్ కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పురపాలక సంఘాల అభివృద్ధికి అధికారులు, పాలకవర్గ సభ్యులు అందరు సమన్వయంతో కృషి చేయాలన్నారు. 2024-25 వార్షిక అంచనా బడ్జెట్లలో మున్సిపల్ సొంత వనరుల నుండి రూ.32 కోట్ల 91 లక్షల ఆదాయం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుండి (కాపిటల్) రూ.25 కోట్ల 92 లక్షల ఆదాయం, డిపాజిట్లు రూ.36 లక్షలు మొత్తం అంచనా బడ్జెట్ రూ.59 కోట్ల 19 లక్షల కేటాయించడం జరిగిందని తెలిపారు. తెలంగాణ మున్సిపాలిటీ చట్టం-2019 ప్రకారం మొత్తం సాధారణ ఆదాయం నుండి కార్మికుల వేతనాలు, చార్జ్, గ్రీన్ బడ్జెట్, ఇతర ఖర్చులు మొత్తం రూ.24 కోట్ల 95 లక్షలు, మిగులు బడ్జెట్ రూ.2 కోట్ల 65 లక్షలున్నాయని, ప్రజా సౌకర్యాల కల్పన కోసం రూ.32 లక్షలు, వార్డుల వారీగా మిగులు రూ.4 కోట్ల 98 లక్షలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుండి వ్యయం (కాపిటల్) రూ.25 కోట్ల 92 లక్షలు, మున్సిపల్ సొంత ఆదాయం నుండి అభివృద్ధికి రూ.7 కోట్ల 96 లక్షలు ప్రతిపాదించగా ఏకగ్రీవంగా ఆమోదించామన్నారు. పురపాలక సంఘ పరిధిలో వివిధ రకాల పన్నులను 100 శాతం వసూలు చేయడంతో ట్రేడ్ లైసెన్సు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

నవతెలంగాణ-జన్నారం

అభివృద్ధి రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డీఎల్‌పీఓ ధర్మారాణి సూచించారు. మండలంలోని పోన్కల్ మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. మార్చి31 ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో వంద శాతం పన్నులను వసూలు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యదర్శులు సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సింగడి రమేష్, ఈఓ రాహుల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై వినతిపత్రం

నవతెలంగాణ-మందమర్రి

ప్రజా సమస్యలపై ప్రజావాణిలో కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి కడార్ జీవన్ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.రాజేశ్వర్, తహసీల్దార్ కె.చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందించి సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అందుగుల పేట, పులిమడుగు, బొక్కలగుట్ట గ్రామ పంచాయతీలలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి వస్తున్న నీరు చాలా కాలంగా రావడంలేదన్నారు. ప్రజలకు నీటి సమస్య తీవ్రంగా ఉందని, వేసవి కాలం దృష్ట్యా మరమ్మత్తు చేసి తాగునీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేగుంట రాజయ్య, కార్తీక్, శేఖర్, సురేష్, సందీప్ పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తును పరిష్కరించేలా కృషి

నవతెలంగాణ-జన్నారం

సమస్యలపై ప్రజలు ఇస్తున్న ప్రతి దరఖాస్తును పరిష్కరించేలా కృషి చేస్తున్నామని మండల అధికారులు అన్నారు. సోమవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వారు దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజ మనోహర్ రెడ్డి, ఎంపీడీఓ శశికళ, డీఎల్‌పీఓ ధర్మారాణి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు మామిడి రైతులకు అవగాహన

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని కన్నాల, భీమిని రైతు వేదికలలో మంగళవారం మామిడి పంటలో ప్రస్తుతం చేపట్టాల్సిన యాజమాన్యపద్ధతులు, సస్యరక్షణ సంగారెడ్డి పండ్ల పరిశోధన శాస్త్రవేత్త సుచిత్ర వీడియో కాన్ఫరెన్స్‌లో వివరిస్తారని హెచ్ఈఓ సుప్రజ తెలిపారు. మామిడి సాగు చేస్తున్న రైతులు రైతు వేదికలో హాజరు కావాలని కోరారు.

సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తులు

నవతెలంగాణ-మందమర్రి

సాంకేతిక పరిజ్ఞానం, ఫోరెన్సిక్ మాడ్యూల్స్, శాస్త్రీయ దర్యాప్తు పద్ధతుల పురోగతితో నేరస్తులు చట్టం నుంచి తప్పించుకోవడం అసాధ్యమని సీఐ శశిధర్ అన్నారు. సోమవారం పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నేర చరిత్ర, ప్రస్తుత జీవన విధానం, నేర ప్రవృత్తి వైపు ప్రేరేపించిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఏ నేరం చేసినా పోలీసులు ట్రాక్ చేస్తారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నేరస్థులు తమ అకృత్యాలు పునరావృతం కాకుండా సరైన మార్గదర్శకత్వంతో ఆలోచనా విధానంలో మార్పు తీసుకురావడానికి పోలీసు శాఖ ముందు ఉంటుందన్నారు. నేరం చేసే ముందు కుటుంబ భవిష్యత్తు గురించి ఆలోచించాలని సూచించారు. లోక్ సభ ఎన్నికలలో ఎటువంటి అలజడి సృష్టించకుండా మంచి ప్రవర్తన కోసం బైండోవర్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్, ఏఎస్ఐ మల్లేశం, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన కార్మికుల

బిల్లులు చెల్లించాలి

నవతెలంగాణ-నస్పూర్



మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రాజేశ్వరి, రాజారాం అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఏఓకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, నెలలు గడిచిన ప్రభుత్వం ఇచ్చే వేతనాలు రావడం లేదన్నారు. కోడి గుడ్డుకు రూ. ఐదు ఇస్తే గ్రామీణ ప్రాంతాల్లో రూ.ఆరు, ఏడు కొనుక్కొని పాఠశాల విద్యార్థులకు పెడుతున్నామన్నారు. దీనివల్ల అదనంగా ఒక్కో కార్మికురాలు కోడి గుడ్డుకు రెండు రూపాయలు అదనంగా పెట్టుకోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం కూడా బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలలకు సరఫరా చేసే బియ్యం మొత్తం పురుగులు, రాళ్లతో ఉంటున్నాయన్నారు. నాణ్యత గల సన్నబియ్యాన్ని పాఠశాలలకు అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలని, కార్మికులందరికీ ఐడీ కార్డులు, యూనిఫామ్, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ స్పందించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దూలం శ్రీనివాస్, బుచ్చన్న, లక్ష్మణ్, రఫియా, సునీత, పోసక్క, మధునమ్మ, వరలక్ష్మి, సరిత, విమల, జ్యోతి, లక్ష్మి, తిరుపతి పాల్గొన్నారు.

కెకె 5 గని ఫిట్ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-మందమర్రి

ఏఐటీయూసీ బ్రాంచి అసిస్టెంట్ సెక్రటరీ సోమిశెట్టి రాజేశం అధ్యక్షతన కెకె 5 గని వద్ద ఫిట్ కమిటీ ఎన్నికను నిర్వహించారు. కెకె5 గని ఇన్‌చార్జిగా కంది శ్రీనివాస్, ఫిట్ వైస్ ప్రెసిడెంట్‌గా గోవిందుల రమేష్, ఫిట్ కార్యదర్శిగా గాండ్ల సంపత్ అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శిగా ప్రేమ్‌లాల్‌తో పాటు 18 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా ఎస్సీడబ్ల్యుయూ ఏఐటీయూసీ అధ్యక్షులు జేబీసీసీఐ పర్మినెంట్ ఏఐటీయూసీ వేజ్ బోర్డు సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ కెకె 5 గని ఫిట్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కమిటీ సభ్యులు కార్మిక సంక్షేమం, యూనియన్ బలోపేతం కోసం శ్రమించాలని కోరారు. కార్మికులు నమ్మకంతో ఏఐటీయూసీ యూనియన్‌ను గుర్తింపు సంఘంగా గెలిపించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టడానికి సంక్షేమానికి పాటు పడాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా తప్పకుండా నెరవేరుస్తామని తెలిపారు. సీఎంపీఎఫ్ లోన్ విషయంలో కార్మికులు ఇబ్బందులు పడుతున్న సమయంలో తమ యూనియన్ కృషి వలన సమస్య పరిష్కారమైందన్నారు. త్వరలో సీఎంపీఎఫ్ వివరాలు ఆన్‌లైన్ విధానంలోకి మారుతుందని దీనికి సంబందించిన సర్క్యులర్ నెల రోజుల్లో వస్తుందన్నారు. యూనియన్‌లో చేరిన వారికి సీతారామయ్య కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి సెక్రటరీ శైలంద్ర సత్యనారాయణ, బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ బీమనాధుని సుదర్శన్, ఆర్గనైజషన్ సెక్రటరీ పెద్దపల్లి బాణయ్య, కాంట్రాక్టు సంఘం అధ్యక్షులు జెట్టి మల్లయ్య పాల్గొన్నారు.

ఓసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నస్పూర్



వేసవి కాలంలో ఓసీ కార్మికుల ఆరోగ్య సంరక్షణ, ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎన్టీయూసీ నాయకులు అన్నారు. సోమవారం ఓసీ మేనేజర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వేసవికాలంలో వేడి తీవ్రత అధికంగా ఉన్నందున ఓసీలో పని చేస్తున్న కార్మికులకు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు తక్షణమే మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేయాలన్నారు. ఏప్రిల్ మొదటి వారం నుండి ప్రతీ కార్మికునికి రెండు మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఎయిర్ కూలర్లు, క్వారీ షెల్టర్లలో చల్లటి మంచి నీరు సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఏప్రిల్ నెల నుండి వర్షాకాలం మొదలయ్యే వరకు ఉ.6 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు తిరిగి సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు పని వేళలుగా మార్చాలని, క్వారీలో వివిధ పనులు చేస్తున్న సర్వే సిబ్బందికి, బ్లాస్టింగ్ సిబ్బందికి భోజన విరామం కంటిన్యూ చేస్తూ ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వర్షాకాలం ప్రారంభం అయ్యేవరకు అవకాశం కల్పించాలన్నారు. అలాగే క్వారీలో దుమ్ముదూలిని నివారించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. క్యాంటీన్‌లో రెస్ట్ హాల్లో ఏసీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ ఏరియా కార్యదర్శి శీలం చిన్నయ్య, ఫిట్ సెక్రెటరీ బి జాన్సన్, సెంట్రల్ సెక్రెటరీ కాల్వ శ్రీను, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుధాకర్, షిఫ్ట్ సెక్రటరీలు రాజశేఖర్, కే శ్రీను, లక్ష్మణ్, రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటి ఎదుట సఫాయి కార్మికుల నిరసన

నవతెలంగాణ-హాజీపూర్



తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంచిర్యాల ఎమ్మెల్యే ఇంటి ఎదుట నిరసన తెలిపారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడం వల్ల పట్టణ అధ్యక్షుడికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి 6, 7, 10 నెలల బకాయిలు ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. కుటుంబాల పోషణ, పిల్లల చదువులు, ఇంటి కిరాయిలు ఇలా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వానికి ఎన్ని సార్లు విన్నవించిన పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ వేతనాలు, సబ్బులు, చెప్పులు, నూనె, బెల్లం, యూనిఫామ్ అందించాలని కోరారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులందరు అట్టడుగు వర్గాలకు చెందిన వారెనని తెలిపారు. పనిచేస్తే కానీ గడవని పరిస్థితి ఉందన్నారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద భీమా, ఇన్సూరెన్స్ తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించిన హామీ ప్రకారం గ్రామ పంచాయతీ సిబ్బందినందరిని పర్మినెంట్ చేయాలన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సాగర్, రాయలింగు, మల్లేష్, సుజిత్, మల్లయ్య, లక్ష్మి, రమేష్, లింగన్న, ప్రశాంత్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ నస్పూర్

వేతనాలు రాక గ్రామపంచాయతీ కార్మికులు పస్తులు ఉంటున్నారని, వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ కోరారు. సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్లఓ ఉన్న బకాయిలు, కొన్ని సంవత్సరాలుగా కార్మికులకు ప్రభుత్వం ఇచ్చే సబ్బులు, నూనె, బెల్లం, చెప్పులు, పనిముట్లు, యూనిఫాంలు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలని, అదేవిధంగా బెల్లంపల్లి మున్సిపల్ నర్సరీ కార్మికులు నాలుగు సంవత్సరాలు పనిచేసారని, జనవరి నెలలో మున్సిపాలిటీలో బడ్జెట్ లేదనే పేరుతో 15 మంది కార్మికులను తొలగించారన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బంధాలత, లావణ్య, రమక్క, రాదక్క, ఇందిరా, వనజ, నిల, రేణుక, సాగర్, రాయలింగు, చిన్నక్క పాల్గొన్నారు.

పోషణ పక్వాడ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-తాండూర్

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈనెల 9 నుంచి 23వ తేది వరకు జరిగే పోషణ పక్వాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బెల్లంపల్లి సీడీపీఓ ఉమాదేవి అన్నారు. సోమవారం బెల్లంపల్లిలోని 65 డిప్ 2 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్కోడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొమ్మిది రోజులపాటు జరిగే పోషణ పక్వాడ కార్యక్రమంలో స్త్రీ శిశుసంక్షేమం ఆహారపు అలవాట్లు చిరుధాన్యాల ఆధారిత వంటకాలు ఆరోగ్యకరమైన ఆహార పద్ధతులపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. గర్భిణుల కోసం ఆరోగ్యకరమైన ఆహార పద్ధతులు ఆహార నియమాల గురించి తెలియజేస్తామన్నారు. అంగన్‌వాడీసెంటర్లలో జరిగే పోషణ పక్వాడ కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు విధిగా పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమానికి వైద్య ఆరోగ్యశాఖ గ్రామీణ అభివృద్ధి అధికారులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పద్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజీవ్‌నగర్‌లో...

మండలంలోని రాజీవనగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లులకు ఆరోగ్యవంతమైన పోశకాహారంపై అవగాహనా కల్పించారు. 6 నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన చేస్తూ వారికి 7నెలల నుంచి అదనపు పౌస్టికాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమం 9 నుంచి 23 వరకు కొనసాగుతుందని సూపర్‌వైజర్ మమత, అంగన్‌వాడీ టీచర్ సుజాత తెలిపారు.

ఉపరితల గని సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఉపరితల గని ద్వారా తలెత్తే సమస్యలను పరిష్కరించాలని 19వ వార్డ్ కౌన్సిలర్ రేగుంట చంద్రశేఖర్ అన్నారు. సోమవారం కలెక్టర్ బదావత్ సంతోష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఓసీ బ్లాస్టింగ్‌కు ఇండ్లు పగుళ్లు తెలుతున్నాయని, దాని ద్వారా విలువడే దుమ్ముదూళితో 18, 19, 20 వార్డుల ప్రజలు శ్వాశకోశ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆధునికరణ ఉపయోగించి బ్లాస్టింగ్ చేయించాలని, దుమ్ముదూళి వెలువడకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

నవతెలంగాణ-జన్నారం

ఉద్యోగ,ఉపాధ్యాయులకు శాపంగా ఉన్న సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముగా కమలాకర్ కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందించారు. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగ ఉపాధ్యాయులు ఎంతో నష్టపోతున్నారన్నారు. ఈ విధానం పెను భారంగా మారిందన్నారు. వెంటనే ఆ విధానాన్ని రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేసి ఉద్యోగ ఉపాధ్యాయులను ఆదుకోవాలని కోరారు. కాంగ్రెస్ మెనీ పేస్టోలో పెట్టిన విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కమలేకర్ నాగేశ్వర రావు, రాష్ట్ర కోశాధికారి వెంకటనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని తాటిగూడలో బెల్లంపల్లి అటవీ శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను బెల్లంపల్లి రేంజ్ అటవీ శాఖ క్షేత్రాధికారి ఏ సుభాష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి రేంజ్ అటవీ శాఖ క్షేత్రాధికారి ఏ.సుభాష్ మాట్లాడుతూ యువత లో మార్పు కోసం బెల్లంపల్లి రేంజ్ అటవీ శాఖ ఆలోచనతో వాలీబాల్ క్రీడాలని నిర్వహిస్తూ వారిలో సామాజిక చైతన్యంతో పాటు పర్యావరణ సమతుల్యం, అటవీ పరిరక్షణపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం మండలంలోని 28 జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్, సెక్షన్ ఆఫీసర్లు ప్రభాకర్ రావ్, శ్రీనివాస్, బీట్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

పురపాలక సంఘ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

నవతెలంగాణ నస్పూర్

జిల్లాలోని నస్పూర్ పురపాలక సంఘ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని, అధికారులు, పాలకవర్గం సభ్యులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ పురపాలక సంఘ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన 2023-24 ఆర్థిక సంవత్సరం సవరించిన బడ్జెట్ అంచనాలు, 2024-25 ఆర్థిక సంవత్సరపు అంచనా బడ్జెట్ ప్రత్యే సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్, మున్సిపల్ కమీషనర్ చిట్యాల సతీష్, మున్సిపల్ చైర్పర్సన్ సురిమిల్ల వేణు, వైస్చైర్మన్ గెల్లు రజితతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పురపాలక సంఘాల అభివద్ధి కొరకు అధికారులు, పాలకవర్గ సభ్యులు అందరు సమన్వయంతో కషి చేయాలని తెలిపారు. 2024-25 వార్షిక అంచనా బడ్జెట్లో 24 కోట్ల 44 లక్షల రూపాయలకు ప్రతిపాదించగా కౌన్సిల్ సభ్యులు ఆమోదించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, జె.ఎ.ఓ. సిహెచ్. అనితాదేవి, వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | మార్చి 12, 2024 | www.navatelangana.com

షెడ్ నెట్స్ ఏర్పాటు చేసుకోవాలి

నవతెలంగాణ-తాండూర్



ఎండలు తీవ్రమవుతున్న తరుణంలో నర్సరీలపై షెడ్‌నెట్స్ ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం నీలయపల్లి పంచాయితీ నర్సరీ సందర్శించి కార్యదర్శి రమాదేవికి పలు సూచనలు చేశారు. రెండు పూటలా నీటినందిస్తూ 100 శాతం మొలక శాతం వచ్చేలా చూడాలన్నారు. మొలకరాని బ్యాగుల్లో తిరిగి విత్తనాలను నాటాలన్నారు. మొక్కల మధ్య కలుపులు తొలగించి మొక్కలు ఆరోగ్యంగా పెరిగేడట్లు చూడాలన్నారు. ఆయనతో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ నందకుమార్ ఉన్నారు.

టీజేఎస్ పార్లమెంట్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కడెం



మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో ఈనెల 15న నిర్వహించే తెలంగాణ జన సమితి పార్లమెంటు సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ జన సమితి నిర్మల్ జిల్లా అధ్యక్షులు కడపత్రి తిలక్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 15న కడెం హరిత రిసార్ట్స్‌లో నిర్వహించే పార్లమెంటరీ సమావేశంలో టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ పాల్గొంటారని వారు అన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా టీజేఎస్ నాయకులు పార్టీ శ్రేణులు కార్యకర్తలు మేధావులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ నాయకులు పాల్గొన్నారు.

31 నాటికి పన్ను వసూలు పూర్తి చేయాలి



నవతెలంగాణ-కెరమెరి

ఈనెల 31 నాటికి వందశాతం ఇంటి పన్ను వసూలుకు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) భిక్షపతి గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలోని పలు రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పారిశుద్ధ్య పనులు కొనసాగించాలని, నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. గ్రామంలో తడిపొడి చెత్తనుసేకరించి డంపింగ్ యార్డుకు తరలించి వేరు చెయాలన్నారు. నర్సరీలో మొక్కలకు నీటిని అందించాలని, ఉపాధి పనులకు ఎక్కువ సంఖ్యలో కూలీలు హాజరయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి భీమయ్య, జీపీ సిబ్బంది గడ్డల వెంకటేశం, నరేష్ ఉన్నారు.

ట్రైబల్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న ట్రైబల్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ట్రైబల్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు లాకావత రమేష్ అన్నారు. సోమవారం ఉట్నూరులోని ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్ట్ అధికారినికి వినతిపత్రం అందజేశారు. చాలామంది ట్రైబల్ జర్నలిస్టులు పేదరికంలో ఉన్నారని అన్నారు. వారికి ఇండ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డు సౌకర్యం కల్పించి, ఉట్నూర్‌లో ఐటీడీఏ తరఫున ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా మీ దృష్టిలో ఉన్న సమస్యలను నేరుగా తనకు సమాచారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి చవాన్ రామేశ్వర్, ఉపాధ్యక్షులు ఆత్రం రాము, కోశాధికారి జాదవ్ వసంతరావు, చవాన్ సేవాదాస్, రాథోడ్ ప్రకాష్, జాదవ్ రవికిరణ్, సిడం కైలాస్, సుధాం డివిజన్ అధ్యక్షుడు రాథోడ్ అజయ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి విశ్వం రావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఘన సన్మానం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని సామజిక పరివర్తన మహిళ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. సామాజిక పరిశుభ్రత ధ్యేయంగా పని చేస్తున్న కార్మికుల కృషి మరువలేనిదని తాజా మాజీ సర్పంచ్ సురకంటి ముత్యంరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ సంఘం నాయకురాలు నిర్మల, మహిళ సంఘ నాయకులు, పంచాయతీ కార్యదర్శి విక్రమ్ రాజు, గ్రామ వంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ప్రభుత్వ అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక లోడ్ ట్రాక్టర్‌ను ఆదివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. సమాచారాన్ని తహసీల్దార్‌కు అందజేసినట్టు ఎస్సై జి.లింబాద్రి తెలిపారు. డ్రైవర్ పరారీలో ఉన్నట్లు వివరించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రిని కాంగ్రెస్‌లోకి రానియెుద్దు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి రానియొద్దని మండల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అవినీతి పరుడు అయిన ఇంద్రకరణ్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి రానీయమని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర పోరాటంలో ఎన్నో కేసులు ఎదుర్కొంటూ ఎన్నో సమస్యలపై శ్రీహరిరావుని ఇబ్బంది పెట్టాలని చూడటం సరికాదని అన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని పార్టీని, కాంగ్రెస్ కార్యకర్తలను కాపాడాలని వేడుకొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు వొద్నలా రాజేశ్వర్, అట్ల రాంరెడ్డి, ఈటెల శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, భీమన్న, సమ్మెట రవి పాల్గొన్నారు.

శివాలయంలో కుంకుమార్చన

నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని సదాశివపేట శివాలయంలో ఆలయ పూజారి అంబేద శంకరయ్య సంతోష్ ఆధ్వర్యంలో కుంకుమార్చన పూజా కార్యక్రమం నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని చివరి సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారికి అభిషేకం, కుంకుమ పూజ, అమ్మవారికి ఓడిబియ్యం, తులాభారం, పుట్టువెంట్రుకలు, స్వామివారి సన్నిదిలో నిర్వహించారు. అనంతరం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, ఇతర పారితోషికాలివ్వాలి



నిర్మల్

నవతెలంగాణ-నిర్మల్

పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, ఇతర పారితోషికాలు ఇవ్వాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.గంగామణి, చంద్రకళ అన్నారు. సోమవారం డిఎంహెచ్ఓ కార్యాలయంలో డిఎంహెచ్ఓ ధన్‌రాజుకు తమ గోడును విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత సంవత్సరంలో చేసిన లెప్రసీ సర్వేకు పారితోషికం ఇప్పటివరకు చెల్లించకపోగా, ప్రస్తుతం మళ్లీ ఆశాలందరూ సర్వే చేయాలని ఒత్తిడి చేస్తున్నారని విమర్శించారు. గతంలో ఆశా వర్కర్ వాలంటర్‌ను తీసుకొని సర్వే చేశారన్నారు. కానీ రెమ్యూనరేషన్ ఇచ్చిన పాపాన పోలేదని వాపోయారు. ఆశాలు వాలెంటర్లకు సొంత డబ్బులు ఇచ్చారని తెలిపారు. అధికారులను అడిగినప్పుడల్లా వస్తాయని అంటున్నారే తప్ప వచ్చింది లేదన్నారు. ఆశా వర్కర్లకు రావాల్సిన వేతనం కూడా సరైన సమయంలో అందడం లేదన్నారు. పారితోషికం పేరు మీద పారితోషికం లేని పనులు అనేకం చేయిస్తున్నారని విమర్శించారు. దీంతో పని భారంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న కంటి వెలుగు డబ్బులు, ఎలక్షన్ డ్యూటీ డబ్బులు ఇప్పటి వరకు ఇవ్వలేదని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పారితోషికాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భాగ్యలక్ష్మి, జిల్లా కోశాధికారి రామలక్ష్మి మండలాల నాయకులు శ్యామల, శ్రీలత, గంగలక్ష్మి కవిత, సుజాత, కమల, సునీత, రాజమణి, లావణ్య పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : ఆశా వర్కర్స్ లెప్రసి సర్వే డబ్బులను కార్మికుల ఖాతాల్లో జమ వేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అన్నారు. సోమవారం ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ముందుగా సీఐటీయూ కార్యాలయం నుండి ర్యాలీగా వెళ్లారు. కలెక్టరేట్ ఎదుట సమస్యలను పరిష్కరించాలంటూ ఆశాలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బొజ్జ ఆశన్న మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుండి లెప్రసి డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కానీ ఇప్పటి వరకు తమ ఖాతాలో డబ్బులు వేయడం లేదని, ఇతర జిల్లాల్లో డబ్బులు వేశారని పేర్కొన్నారు. పనిని బట్టి పారితోషికం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం 1,2తేదీల్లో పారితోషికాలను జమ చేసేదని, నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు కార్మికుల ఖాతాల్లో డబ్బులు వేయలేదన్నారు. ఆశా కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అగ్గిమల్ల స్వామి, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.సుజాత, ఆశా యూనియన్ జిల్లా నాయకులు లక్ష్మీ, స్వప్న, పుష్పలత, గంగమ్మ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: తమకు పెండింగ్‌లో ఉన్న లెప్రసీ సర్వేకు సంబంధించి డబ్బులు చెల్లించాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప డిమాండ్ చేశారు. జిల్లా వైద్యాధికారి తుకారాం బట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా లెప్రసీ సర్వేలు చేశామన్నారు. ఇతర జిల్లాల్లో లెప్రసి సర్వే బిల్లులు చెల్లించినప్పటికి మన జిల్లాలో మాత్రం ఇప్పటి వరకు సర్వే డబ్బులు చెల్లించలేదని పేర్కొన్నారు. గతంలోని, ప్రస్తుత బిల్లులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి, తెలంగాణ ఆశా వర్కర్స యూనియన్ జిల్లా నాయకులు కేసర, కవిత, శాంత పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్



ఆసిఫాబాద్

జీపీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ గ్రామపంచాయతీ కార్మికుల 6నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న అన్నారు. సోమవారం ఎమ్మెల్యే పాయల శంకర్ పీఏ అశోక్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ సిబ్బందికి 6, 7 నెలల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలన్నారు. కార్యదర్శులందరిని పర్మినెంట్ చేయాలన్నారు. కారోబారి, బిల్ కలెక్టర్లకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, ఇన్సూరెన్స్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధి లైట్స్, డంపింగ్ యార్డ్స్, హరితహారం, పల్లె పకృతి వనాలు, వైకుంఠ ధామాలు తదితర పనుల్లో నిత్యం శ్రమిస్తూ గ్రామీణ ప్రాంతాలలో ఎలాంటి అంటువ్యాధులు, అనారోగ్యాలు రాకుండా ప్రజలకు సేవలందిస్తున్నారని అన్నారు. వీరిలో అత్యధికులు దళితులు, బలహీన వర్గాలకు చెందిన పేద కార్మికులు ఉన్నారని తెలిపారు. అటువంటి కార్మికులకు రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లో గత 6 నుంచి 7 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి అగ్గిమల్ల స్వామి, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు అడెల్లు, గంగన్న, ఇంద్రజ్, సంతోష్, జిల్లా నాయకులు నగేష్, విలాస్, సంతోష్, గంగయ్య, శంకర్, దశరథ్, తానేరావు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : గ్రామపంచాయతీలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులకు ఐదు నెలల నుండి ఏడు నెలల వరకు పెండింగ్ వేతనాలు ఉన్నాయని అన్నారు. దీంతో సిబ్బంది ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మల్టీపర్పస్ వర్కర్ విధానంతో ఉద్యోగ భద్రత కోల్పోయారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన రూ.9,500 వేతనాలు కూడా అందరికీ రావడం లేదని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. జీవో నెంబర్ 51 సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్‌లను పంచాయతీ సహాయ కార్యదర్శులుగా నియమించాలని, అందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆ లోపు జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, మరణించిన కార్మికులకు ఐదు లక్షల ఇన్సూరెన్స్ అమలు కోసం విధివిధానాలను ఖరారు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా నాయకులు గంగారాం, బాబురావు, గంగారాం, దుర్గ ప్రసాద్, అనిల్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్



ఆసిఫాబాద్

రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోథ్



మండలంలోని నిగిని గ్రామ సమీపంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శిఖర్ కైలాష్ టేక్డి రోడ్డు పనులను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. సోమవారం రూ.12 కోట్ల నిధులతో చేపట్టే ఈ పనులకు స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మారుమూల గ్రామాలతో పాటు దేవాలయ ఆలయానికి రోడ్డు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే గ్రామాలలో మురికి కాలువలతో పాటు మరిన్ని అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లింభాజీ మహారాజ్, జడ్పీటీసీ సంధ్యారాణి, నాయకులు సురేందర్ యాదవ్, నారాయణ్ రెడ్డి, చట్ల ఉమేష్, స్వామీ, రజియా బేగం, ప్రవీణ్, అల్లంకొండ ప్రశాంత్, బొడ్డు శ్రీనివాస్, ఎల్క రాజు, లింబాజి పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఐకి సన్మానం

నవతెలంగాణ-కౌటాల



మండలంలోని తాటిపెల్లి కుర్ర వద్ద గల సిద్ధి హనుమాన్ దేవస్థానంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఐ మధుకర్‌ను సనాక్మనించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎలుములె దత్తు మాట్లాడుతూ 40వ మహాశివరాత్రి జాతరలో వారం రోజుల పాటు ఎలాంటి ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాతర ముగింపుకు అహర్నిశలు కష్టపడిన కౌటాల ఎస్ఐ మధూకర్‌ను పరమపూజ్య బాలబ్రహ్మచారి పీతాంబర్ మహారాజ్ జ్ఞాపికను అందించి శాలువాలతో సన్మానించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా అభివృద్ధికి సింగరేణి కృషి



నవతెలంగాణ-రెబ్బెన

జనాభాలో సగమైన మహిళలకు తగిన ప్రాధాన్యతనిస్తూ దేశం మరింతగా అభివృద్ధి చెందుతుందని, సింగరేణి కాలరీస్ కంపెనీ మహిళల ఆర్థిక, సాంఘిక అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతుందని మార్కెటింగ్ జనరల్ మేనేజర్ దేవేందర్ పేర్కొన్నారు. హైదరాబాద్ సింగరేణి భవనంలో మధ్యాహ్నం నిర్వహించిన మహిళా దినోత్సవం వేడుకల్లో ఆయన ప్రసంగించారు. సింగరేణిలో మహిళల ఆర్థిక స్వావలంబన కోసం సింగరేణి సేవా సమితి ద్వారా 20 సంవత్సరాలుగా అనేక వృత్తి శిక్షణలను ఉచితంగా అందిస్తుందన్నారు. 15 వేల మంది మహిళలు శిక్షణ పొందారని, అనేక మంది స్వయం ఉపాధి బాట పట్టారన్నారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ శిక్షణలో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ప్రతి ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సింగరేణి వ్యాప్తంగా 12 ఏరియాల్లో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ జనరల్ మేనేజర్ ఎండీ రాజశేఖర్‌రావు మహిళా దినోత్సవం ప్రాధాన్యత గురించి, సింగరేణి మహిళల అభ్యున్నతికై తీసుకొనే చర్యల గురించి ఆయన వివరించారు. సింగరేణి ఉద్యోగ, ప్రజాకవి జయరాజ్ ఈ సందర్భంగా మహిళా శక్తిపై పాటలతో తెలియజేశారు. మహిళలకు వివిధ క్రీడా, సాంస్కృతిక విభాగాల్లో పోటీలు నిర్వహించగా సేవా నాయకురాలు బహుమతులను అందజేశారు. ఇందులో షెర్మిల మేజస్, లక్ష్మీప్రియ, స్వరూప, దేవేందర్, అడ్మినిస్టేటివ్ మేనేజర్ ఎస్ భాస్కర్ పాల్గొన్నారు.

జీరో కరెంట్ బిల్లు కోసం బారులు

- క్యూలైన్‌లో విద్యుత్ వినియోగదారులు



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఏడాది పాటు నెలకు 200 యూనిట్ల వరకు వాడిన వినియోగదారులకు ఎప్పటి మాదిరిగానే కరెంట్ బిల్లులు రావడంతో సదరు వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఈమేరకు మున్సిపల్ కార్యాలయంలో లైన్ కట్టి మళ్లీ దరకాస్తు చేసుకుంటున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా రెండు నెలల క్రితం ప్రజాపాలనలో 'గృహ జ్యోతి' పథకానికి అర్హులైన వినియోగదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ అధికారులు నెల క్రితం ఇంటింటా తిరిగి దరఖాస్తుల పరిశీలన, పెండింగ్ బిల్లలు వసూళ్ల చేశారు. అయితే అర్హులైన వారికి కొత్తగా జీరో కరెంట్ బిల్లు రావాల్సి ఉండగా, అనేక మంది వినియోగదారులకు ఎప్పటి మాదిరిగానే బిల్లులు రావడంతో వారు ఆదోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారుల తప్పిదమో ప్రజాపాలనలో మున్సిపల్ అధికారుల పొరపాటో తెలియదు గాని జీరో బిల్లుకు అర్హులైన వారికి కూడా బిల్లు రావడంతో అయోమయానికి గురవుతున్నారు. ఈ క్రమంలో ఉదయం నుంచే మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్నారు. అధికారుల చేసిన పొరపాటు వల్ల తాము పని వదులుకొని ఇలా కార్యాలయంలో బారులు తీరడం ఇబ్బందిగా ఉందని పలువురు వినియోగదారలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని నామనగర్ గ్రామంలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నామనగర్ గ్రామానికి చెందిన మేడి సత్యం సుజాతల కుమారుడు మేడి సాయి(18) గత సంవత్సర కాలంగా ఇదే గ్రామానికి చెందిన అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. పెద్దలు పంచాయతీ నిర్వహించి పెళ్లికి నిర్ణయం చేసినప్పటికీ సదరు యువతికి మైనర్ కావడంతో పెళ్లి వాయిదా వేశారు. అప్పటి నుంచి తన ప్రేయసి ఇంట్లోనే ఉంటున్న సాయి సోమవారం అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఇరుగుపొరుగు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుని మెడకు గాట్లు ఉండడంపై పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్ దర్యాప్తు చేపడుతున్నారు.

శివరాత్రి జాతర ఆదాయం రూ. 22లక్షలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న స్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 7,8,9 తేదిల్లో నిర్వహించిన జాతర సందర్భంగా రూ. 22,76,150 ఆదాయం సమకూరినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ మైలారపు మురళీధర్, ఆలయ ఈఓ వేణుగోపాల్ గుప్తాలు తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఆదిలాబాదు డివిజన్ పరిశీలకులు ఎం. రాజమౌళి పర్యవేక్షణలో హుండీల లెక్కింపు నిర్వహించారు. హుండీల ద్వారా రూ. 5,74,400 ఆదాయం రాగా బహిరంగ వేలం, టికెట్ల విక్రయం మొత్తం కలిపి రూ. 22,76,150 ఆదాయం సమకూరింది. లెక్కింపులో పంచాయతీ కార్యదర్శి సుమలత, ఉత్సవ కమిటీ సభ్యులు, వాసవీ సేవాదళ్ సభ్యులు, అరుణోదయ పాఠశాల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు. కాగా గత సంవత్సరం రూ. 18,62,120 ఆదాయం రాగా ఈ సంవత్సరం అధనంగా రూ. 4,14,030 ఆదాయం సమకూరింది. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ఈజ్‌గాం ఏఎస్సై హీరామన్ బందోబస్తు నిర్వహించారు.

రేపు సర్వ సభ్య సమావేశం

నవతెలంగాణ-కెరమెరి

ఈనెల 13న సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రత్యేక అధికారులు నివేదికతో సకాలంలో ఉదయం 11గంటలకు హాజరు కావాలని కోరారు.